క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడనున్నాయని పేట్‌బషీరాబాద్ ఏఈ జ్ఞానేష్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలోని వెన్నెలగడ్డ, దర్గా ఎస్టేట్, శ్వేత విహార్, ఎస్‌బీఐ బ్యాంక్, జయరామ్‌నగర్, గణేష్‌నగర్, శ్రీకృష్ణనగర్, రుక్మిణి ఎస్టేట్స్, జేకే నగర్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు..

◆ అదే విధంగా 11కేవీ రామరాజునగర్ ఫీడర్ పరిధిలో సుచిత్ర సర్కిల్‌లోని మై ఫ్రెండ్స్ రెస్టారెంట్ ప్రాంతం, రామరాజునగర్, ఓం బుక్స్, లయోలా కళాశాల ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బాలాజీ ఫీడర్ పరిధిలో..

నిజాంపేట్: రోడ్డు వెడల్పు పనుల నేపథ్యంలో గురువారం భౌరంపేట్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ బాలాజీ ఫీడర్ పరిధిలో శంభీపూర్, మహేశ్వరం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

జగద్గిరిగుట్ట: సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి మెరుగైన సేవలు పొందాలని జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ ఏఈఈ రాధాకిషన్ ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 19న చింతల్‌హనుమాన్ గుడి వద్ద, భగత్‌సింగ్ నగర్ ప్రభుత్వ పాఠశాల, సోమయ్యనగర్‌లోని పోచమ్మ ఆలయం వద్ద, 20న రింగ్ బస్తీ కమ్యునిటీ హాల్, 21న శివ నగర్‌కమ్యునిటీ హాల్, 22న మగ్దూం నగర్ గణేష్ మండపం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లలో తమ సిబ్బందికి విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

అయ్యప్పస్వామి ఆలయ నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేట్‌లోని ఆశ్రిత వత్సలఅయ్యప్పస్వామి ఆలయ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా వై.సీతారాంరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎల్.యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శులుగా జి.రాంరెడ్డి, కోశాధికారిగా ఎం.మల్లారెడ్డి, కార్యదర్శిగా విషేశ్వర్‌ను ఎన్నుకున్నారు. అదే విధంగా కార్య నిర్వాహక సభ్యులుగా నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, వై.జంగారెడ్డి, శంకర్ ఆనంద్ శర్మ, డి.సీతారాంరెడ్డి, మన్నె బాలరాజు, పి.వెంకట్‌రెడ్డి, వై.అంజిరెడ్డి, ఆకుల వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హుండీ డబ్బుల లెక్కింపు



ఆలయంలో హుండీ నగదును లెక్కిస్తున్న భక్తులు

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ కార్యాలయంలోని కనకదుర్గాదేవి ఆలయంలో బుధవారం హుండీ డబ్బులను లెక్కించారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గాదేవి బుధవారం అన్నపూర్ణదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అనంతరం జీఎం శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



దుండిగల్: గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు పక్కన మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాగిల్లాపూర్ నుంచి గండిమైసమ్మ చౌరస్తా వైపు వెళ్లే దారిలో ఫుట్‌పాత్ పక్కన ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించారు. మృతుడు యాచకుడని, ఒంటిపై నీలం రంగు టీషర్ట్, వంకాయ రంగు షార్ట్ ధరించి ఉన్నాడన్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బతుకమ్మ సంబురం



బతుకమ్మలతో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందం



బతుకమ్మతో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత



మీనాక్షి ఎన్‌క్లేవ్‌లో బతుకమ్మతో మహిళలు

చింతల్: ప్రకృతి మనకు జీవనాధారం అని చింతల్ రాయల్ డిగ్రీ కళాశాల డైరెక్టర్లు అన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబరాలు ఆకాశాన్నంటాయి. కళాశాలలో బతుకమ్మ 6వ రోజున విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. పల్లెదనం ఉట్టిపడేలా వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి నీవు బతుకుతూ మమ్మల్ని బతికించమని ప్రకృతి నుంచి సేకరించిన వాటిని తిరిగి నీటిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ.. ప్రకృతి మనకు జీవనాధారం అని వాటి నుంచి మనకు మేలు చేకూరుస్తాయని అందుకే ఈ బతుకమ్మను సంప్రదాయంగా జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అందమైన బతుకమ్మలను పేర్చిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు జి.రమేష్ బాబు, ఎన్.వెంకట్‌రెడ్డి, సీహెచ్ గోవిందరెడ్డి, కె.రామకృష్ణ, జయశంకర్‌గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ మేనక పాటిల్ మరియు అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ ప్రభుత్వ కళాశాలలో...

సుభాష్‌నగర్: బహదూర్‌పల్లి చౌరస్తాలోని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను కళాశాల ఆవరణలో పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం రమేష్, ఐలయ్య, ప్రేమనందు, హైమావతి, రామరాజు, కవిత, వెంకటేశ్వర్లు, ఉపేందర్‌రావు, సత్యనారాయణలతో పాటు కేఎం పాండు మెమోరియల్ గవర్నమెంట్ వొకేషనల్ ప్రిన్సిపాల్ షేక్ మైమూన్, శ్రీకాంత్, రజిని, పరశురాం తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.



మహాలక్ష్మీదేవిగా గాజులరామారం చిత్తారమ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ వేడుకలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఆలయాల్లో అమ్మవార్లను శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించగా భక్తులు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు, యువతలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్



జీడిమెట్ల డివిజన్ మీనాక్షి కాలనీలో మహిళలు..





రాయల్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మలతో కలాశాల సిబ్బంది, విద్యార్థినులు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వాటర్‌వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి, ఉద్యోగులు

ప్రజా ఆశీర్వాద సభకు గులాబీ దళం



మేడ్చల్‌లో బుధవారం జరిగిన సీఎం కేసీఆర్ ప్రజాశీర్వాద సభకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి భారీగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే వివేకానంద్ ఆధ్వర్యంలో 500 పైచీలుకు కార్లు, బైక్‌ల ర్యాలీతో సభకు వెళ్లారు. – కుత్బుల్లాపూర్

రాత్రి 11గంటల లోపు షాపులు మూసివేయాలి

మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్

గచ్చిబౌలి: రాత్రివేళ అన్ని దుకాణాలు 11గంటలలోపే మూసివేయాలని మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డీఎల్‌ఎఫ్ ప్రాంతం, మాదాపూర్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్ట్రీట్ వెండర్స్‌తో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. రాత్రివేళ తనిఖీలు ఉంటాయని చెప్పారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు, సబ్ ఇన్‌స్పెక్టర్లు శోభన్‌బాబు, భానుప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి, పోలీసులు, స్ట్రీట్ వెండర్లు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో జేఎన్‌టీయూహెచ్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డా. విజయకుమార్‌రెడ్డి

బాలానగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో ప్రావీణ్యత సంపాదించి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. విజయకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్ కళాశాల విద్యార్థులు హైదరాబాద్‌లోని ఎంజీఐటీలో జరిగిన ఇంటర్ కళాశాల స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొని బాస్కెట్ బాల్ బాలుర పోటీల్లో పాల్గొని ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. విజయకుమార్‌రెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీ కౌన్సిల్ డా. ఎన్. దిలీప్, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ ఎలాంటి స్పోర్ట్స్ ఈవెంట్స్ జరిగిన జేఎన్‌టీయూహెచ్ విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచిన యూనివర్సిటీకి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. స్పోర్ట్స్‌లో పాల్గొనే వారికి కళాశాల నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

గ్లోబల్ అలుమ్నీ మీట్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ కట్టా నరసింహారెడ్డి, అలుమ్నీ మీట్ వరల్డ్ అధ్యక్షుడు హరిప్రసాద్

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్‌లో గ్లోబల్ అలుమ్నీ మీట్ 2023 కార్యక్రమాన్ని డిసెంబర్ 22, 23వ తేదీల్లో నిర్వహించనున్నట్లు వీసీ కట్టా నరసింహారెడ్డి బుధవారం తెలియజేశారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్లోబల్ అలుమ్నీ మీట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్లోబల్ అల్యూమిన్ మీట్ అనేది మొట్టమొదటిసారిగా జేఎన్‌టీయూహెచ్‌లో నిర్వహిస్తున్నామన్నారు. యూనివర్సిటీ, ఇంజినీరింగ్ అనుబంధ కళాశాలల్లో విద్యను అభ్యసించి, వివిధ దేశాల్లో ఉంటున్న సుమారు రూ.2.50లక్షల మంది వరకు ఉన్నారని అన్నారు. అలుమ్నీ మీట్ వల్ల విద్య, వైద్య, వ్యాపార రంగాల్లో జేఎన్‌టీయూహెచ్ విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు పలువురు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం వల్ల నూతన ఉత్తేజం ఏర్పడుతుందన్నారు. ఆసక్తి గల పూర్వపు విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు uaa.jntuh.ac.in వెబ్‌సైట్‌ను వీక్షించవచ్చని కోరారు. కార్యక్రమంలో అలుమ్నీ మీట్ వరల్డ్ అధ్యక్షుడు హరిప్రసాద్, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ తారా కళ్యాణి, ప్రొఫెసర్ జ్యోతుల సురేష్‌కుమార్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ విజయనగర్ కాలనీలోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో బుధవారం మానసాదేవి, నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మానసాదేవి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ హాజరు కాగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మల్లం జ్యోతి, శ్రీనివాస్‌గౌడ్, పరుష వేణు, గరిగే శేఖర్ ముదిరాజ్, జగన్ మోహన్‌రావు తదితరుల పాల్గొన్నారు.

20న హెచ్‌సీయూలో జాతీయ సదస్సు

రాయదుర్గం: ప్రముఖ కవి గుంటూరు శేషేంద్రశర్మ జయంతిని పురస్కరించుకొని ఈనెల 20వ తేదీన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఒకరోజు సదస్సును నిర్వహించనున్నట్లు సదస్సు సమన్వయకర్తలు తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య పమ్మి పవన్ బుధవారం తెలిపారు. 'గుంటూరు శేషేంద్రశర్మ రచనలు-సమాలోచన' పేరుతో హెచ్‌సీయూ మానవీయ శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఆచార్య పిసి వెంకటేశ్వర్లు, యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్ ఈశ్వర్‌రెడ్డి, సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య తాడేపల్లి పతంజలి, ఎస్వీ డిగ్రీ ప్రభుత్వ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ భారతి, ఆచార్య పిల్లలమర్రి రాములు, ఆచార్య గోనానాయక్, డాక్టర్ భూక్య తిరుపతి తదితరులు తమ పరిశోధనా పత్రాలను సమర్పిస్తారని వివరించారు.

మనూలో 'ధనక్‌బజార్ ఎగ్జిబిషన్'

రాయదుర్గం: మహిళా వ్యాపారవేత్తలు ఉత్పత్తులు 'ధనక్‌బజార్ ఎగ్జిబిషన్' ఆకట్టుకుంది. మనూ క్యాంపస్‌లో 'మనూ' లేడీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'సఫా' ఎన్‌జీఓ పర్యవేక్షణలో ఏర్పాటైన ధనక్‌బజార్‌ను వీసీ ఐనుల్‌హసన్ చేతుల మీదుగా ప్రారంభించారు. వ్యాపారంలో మహిళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, 'మనూ' లేడీస్ అసోసియేషన్ అధ్యక్షురాలు అర్షియాహసన్, ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ షాహిదా పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అధ్యాపకుల కొరతతో పార్ట్‌టైం అధ్యాపకుల నియామకాలకు నోటిఫికేషన్ వెలువడింది. క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ నిజాం కాలేజీ, ఇతర పీజీ కాలేజీల్లో వివిధ సబ్జెక్టులను బోధించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా నియామకాలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీలో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌కు ఈ నెల 26 దరఖాస్తులు, నిజాం కాలేజీలో కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఇన్ఫర్మేటిక్స్/ కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో బోధించేందుకు ఈ నెల 21 వరకు దరఖాస్తు స్వీకరించనున్నట్లు తెలిపారు.

బంగారు తెలంగాణ బీజేపీతోనే సాధ్యం



నిజాంపేట్ శ్రీరాములుకుంటలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



ఎస్ఆర్‌నాయక్ నగర్‌లో స్థానికులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

జంగ్ 2023 తెలంగాణ

కుత్బుల్లాపూర్: బంగారు తెలంగాణ బీజేపీతోనే సాధ్యమని.. దొరల పాలనకు అంతం పలకాలంటే బీజేపీకి ఓటు వేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం సుభాష్‌నగర్ డివిజన్ పరిధి అపురూప కాలనీ, ఎస్ఆర్‌నాయక్ నగర్‌లలో పర్యటించిన ఆయన బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వివేకానంద్ మోసపూరిత హామీలతో ప్రజలను మభ్య పెట్టాడని ఆరోపించారు. బీజేపీని గెలిపిస్తే స్థానిక సమస్యల పరిష్కారంతో పాటు ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎమ్మెస్ వాసు, కంది శ్రీరాములు, గుబ్బల లక్ష్మీనారాయణ, మల్లేష్ గౌడ్, బొబ్బ ప్రసాద్, కుమ్మరి శంకర్, అడబాల వెంకట రత్నం, రమణ, విగ్నేష్, అనుక్, మాలాద్రి, భీమరాజు, శ్రీనివాస్ గుప్తా, చంద్రశేఖర్, వల్లూరి ప్రసాద్, కులకర్ణి, బాబు గౌడ్, కాలనీ వాసులు తిప్పా రెడ్డి, గణేశన్, కుంచె కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

◆ నిజాంపేట్‌లోని శ్రీరాములు కుంట పార్క్‌లో వాకర్స్‌ను శ్రీశైలంగౌడ్ కలిసి బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. రెండు సార్లు అధికారం ఇస్తే బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందన్నారు. ఈ సందర్భంగా స్థానిక యువత, సీనియర్ సిటిజెన్‌లు బీజేపీకి మద్దతు తెలిపారు. అదే విధంగా స్ప్రింగ్ విల్లీ కాలనీ, జర్నలిస్ట్ కాలనీల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, డా.రాజు, ఆకుల సతీష్, సులోచన, దాసి నాగరాజు, రాంచందర్ నాయక్, భిక్షపతి, సాయికృష్ణారెడ్డి, అశోక్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ ప్రజల ఓటు ఎవరికో?

కుత్బుల్లాపూర్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉన్న సమయంలో టి.దేవేందర్‌గౌడ్ మేడ్చల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చాడు. ఏకంగా మూడుసార్లు «హ్యాట్రిక్» విజయం సాధించి రికార్డు సృష్టించగా ఆ తర్వాత పునర్విభజనలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంగా ఏర్పడింది.

◆ 2009లో జరిగిన మొట్టమొదటి అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ ప్రజలు చరిత్రాత్మక తీర్పునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులను పక్కనపెట్టి ఏకంగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న కూన శ్రీశైలంగౌడ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించడం విశేషం. ఆ తర్వాత జరిగిన 2014, 2018 ఎన్నికల్లో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా వివేకానంద గెలుస్తూ వచ్చారు.

◆ తాజాగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి «హ్యాట్రిక్» విజయం కోసం పావులు కదుపుతున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో సైతం బీజేపీ తరపున మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పోటీలో ఉంటారని అధిష్టానం ఆదేశాలు జారీ చేయడంతో ప్రచారం ముమ్మరం చేసిన ఆయన తప్పకుండా విజయం సాధిస్తానని ధీమాతో ఉన్నారు.

మైనంపల్లి బుజ్జగింపులు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు. చిత్రంలో నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డిని బుజ్జగించేందుకు కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా బుధవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు స్వయంగా బౌరంపేటలోని భూపతిరెడ్డి కార్యాలయానికి వెళ్లి ఆయనను సముదాయించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఎన్నో ఏళ్లుగా సేవ చేస్తున్న నర్సారెడ్డి భూపతిరెడ్డికి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో టికెట్ లభించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఆయన సేవలను గుర్తించి వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు.

టికెట్ రాకపోయినా పార్టీ విజయానికి కృషి చేస్తా..

◆ అనంతరం భూపతిరెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి 37 ఏళ్లుగా సేవలను అందిస్తున్నానని అన్నారు. తనకు టికెట్ నిరాకరించడంతో నిరాశ చెందినా పార్టీపై ఉన్న అభిమానంతో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పని చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీమాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, దూలపల్లి పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రాజు, డైరెక్టర్ జెమ్మి దేవేందర్, కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్ రెడ్డి, ఆర్.లక్ష్మి, శివకుమార్, ప్రశాంత్, నవీన్‌రెడ్డి, బండి శ్రీనివాస్‌గౌడ్, మిద్దెల యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ పాలన అంతం.. ఓటరుతోనే సాధ్యం



కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డికి మద్దతు తెలుపుతున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని.. నిరంకుశ పాలనను అంతం ఓటరుకే సాధ్యమని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బుధవారం బాచుపల్లిలోని కార్యాలయానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల ప్రజలు తరలి వచ్చి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ... ప్రచార ఆర్భాటాలే తప్ప బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటే ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు, ఇళ్లు నిర్మించుకునేందుకు మహిళలకు రూ.5 లక్షలు అందిస్తామన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

కుత్బుల్లాపూర్: ఎన్నికల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉండే రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. గతంలో పలు వివాదాస్పద స్థలాలు కబ్జా, హత్యలు, దొంగతనాలు, బెదిరింపులతో హల్‌చల్ చేసిన వీరందరిని ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు ప్రస్తుతం మండల తహసీల్దార్ ముందు బైండోవర్ చేస్తున్నారు. మేడ్చల్ డివిజన్ పరిధిలో మొత్తం 93 మంది రౌడీషీటర్లు ఉండగా వారిలో 80శాతం మందిని ఇప్పటికే అదుపులోకి తీసుకొని బైండోవర్ చేశారు. ప్రతిరోజు వీరి కదలికలపై ఎస్ఓటీ, ఎస్బీ, టాస్క్‌ఫోర్స్, స్థానిక లా అండ్ ఆర్డర్ పోలీసులు సైతం నిఘా పెట్టనున్నారు. కొంతమంది స్థానికంగా లేకపోవడంతో వారి ఆధ్వర్యంలో కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వేస్తా డబ్బా.. చేస్తా కబ్జా!



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని రింగ్ బస్తీలో కబ్జాల జోరు కొనసాగుతోంది. ఇటీవలే మర్కండేయ గుడి వెనకాల గది నిర్మాణం చేపట్టగా అధికారులు కూల్చివేశారు. కాగా దీనికి సమీపంలోనే డబ్బాను వేసి సుమారు 50గజాల స్థలం కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

'ప్రవల్లిక ఘటనలో కక్షపూరితంగా కేసులు'



జీవన్

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రవల్లిక ఆత్మహత్య అనంతరం ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వద్ద రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్‌తో కలిసి ఆందోళన కార్యక్రమాలలో పాల్గొన్నందుకు తనపై కక్షపూరితంగా అక్రమ కేసులు పెట్టారని ఓయూ పరిశోధన విద్యార్థి, ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జీవన్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగాల భర్తీలో జరుగుతున్న అవినీతి అక్రమాలు, గ్రూప్-1 పేపర్ లీకేజీ, రాత పరీక్షల రద్దు, టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన తదితర అంశాలపై వరుసగా ఆందోళనలు చేస్తున్న తనను టార్గెట్ చేసి ప్రవల్లిక ఘటనలో శాంతియుతంగా ఆందోళనలో పాల్గొనందుకు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. పేదరికాన్ని ఆసరగా చేసుకొని అమాయకులైన ప్రవల్లిక కుటుంబానికి డబ్బు, ఉద్యోగాన్ని ఎరగా చూపి కేసును తప్పుదోవ పట్టించారని బీఆర్ఎస్ నేతలు ఓట్లతో పాటు ప్రాణాలను సైతం డబ్బుతో కొంటున్నారన్నారు. ప్రవల్లిక ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమైతే గతంలో అనేక మంది ప్రేమ విఫలమై ఆత్మహత్యలు చేసుకున్నారని వారి కుటుంబాలకు ఎందుకు సహకరించలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.